## క్లుప్తంగా

### విశ్వనాథునికి అభిషేక పూజలు



ప్రత్యేకాలంకరణలో విశ్వనాథుడు

**మనుబోలు :** మనుబోలు– చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం రాత్రి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో మహా న్యాసపూర్వక రుద్రాభిషేక పూజలను నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథ స్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

### సీలింగ్ ఫ్యాన్ల వితరణ



**విడవలూరు :** మండలంలోని వావిళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.17 వేలు విలువ చేసే సీలింగ్ ఫ్యాన్లకు సోమవారం వితరణ చేశారు. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న అనపల్లి శ్రీనివాసులు సోదరి కుమార్తె డక్కా మంజుదీప్తి వీటిని అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వై.చెంచురామయ్య ఆమెను అభినందించారు.

### వృద్ధ దంపతులకు ఆపన్నహస్తం

**నెల్లూరు(క్రైమ్):** నగదు బ్యాగ్‌ను పోగొట్టుకొని దిక్కుతోచని స్థితిలో ఉన్న వృద్ధ దంపతులను ఓ హెడ్ కానిస్టేబుల్ అక్కున చేర్చుకున్నారు. వారికి భోజనాన్ని అందించి.. చార్జీలకు నగదు ఇచ్చి చెన్నైకు పంపి మానవత్వం చాటుకున్నారు. వివరాలు.. చెన్నైలో నివాసం ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రంజన్ తల్లిదండ్రులు బారాషహీద్ దర్గాలో గంధమహోత్సవానికి ఇటీవల హాజరయ్యారు. ఈ క్రమంలో నగదు, మొబైల్‌ఫోన్లు ఉన్న బ్యాగ్‌ను పోగొట్టుకున్నారు. దీని కోసం గాలించినా ప్రయోజనం లభించలేదు. ఈ తరుణంలో ఆకలి.. చెన్నై వెళ్లేందుకు డబ్బుల్లేకపోవడంతో అక్కడున్న వారిని ప్రాధేయపడసాగారు. గమనించిన ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ మస్తాన్ వారి వద్దకెళ్లి విషయాన్ని తెలుసుకున్నారు. వారికి భోజనం పెట్టించి రూ.500 నగదుతో పాటు ఆటో చార్జీలను ఇచ్చి రైల్వేస్టేషన్‌కు పంపారు. ఈ క్రమంలో డబ్బులు తిరిగి పంపేందుకు వివరాలను వృద్ధ దంపతులు అడగ్గా, తన పేరు మస్తాన్ అని తిరిగివ్వాల్సిన అవసరం లేదని చెప్పి వెళ్లిపోయారు. ఇంటికి క్షేమంగా చేరుకున్న దంపతులు జరిగిన విషయాన్ని తన కుమారుడికి వివరించారు. దీంతో ఆయన ఎస్పీకి లేఖ రాశారు. తోడ్పాటునందించిన పోలీస్ మానవత్వానికి కృతజ్ఞతలను తెలియజేశారు. దీంతో మస్తాన్ సేవలను ఎస్పీ అభినందించి క్యాష్ రివార్డును ప్రకటించారు.

### ముగిసిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు సోమవారంతో ముగిశాయి. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన అండర్ – 11, 13, 15, 17, 19, మెన్ అండ్ ఉమెన్ కేటగిరీల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

**విజేతలు వీరే..**

- అండర్ – 11 బాలుర సింగిల్స్‌లో నాగసాయి భరత్, బాలికల్లో నిత్య, బాలుర డబుల్స్‌లో నాగసాయి భరత్, యశ్విన్.
- అండర్ – 13 బాలుర సింగిల్స్‌లో వర్షిత్, బాలికల్లో లతారెడ్డి, బాలుర డబుల్స్‌లో వర్షిత్, మహేందర్‌రెడ్డి, బాలికల్లో లత, నిత్య.
- అండర్ 15 బాలుర సింగిల్స్‌లో కార్తీక్, బాలికల్లో సుష్మారెడ్డి, బాలుర డబుల్స్‌లో షాహిర్, రాధాకిషన్, బాలికల్లో దీప్తి, సుదీప్తి.
- అండర్ – 17 బాలుర సింగిల్స్‌లో కార్తీక్, బాలికల్లో సుష్మ, బాలుర డబుల్స్‌లో అనంత్, రేవంత్, బాలికల్లో జాహ్నవి, లక్ష్మీప్రియ.
- అండర్ – 19 బాలుర సింగిల్స్‌లో మహేంద్ర, బాలికల్లో సుష్మ, బాలుర డబుల్స్‌లో ఆదిత్య, కుమారశ్రీ, మెన్ సింగిల్స్‌లో మహేంద్ర, డబుల్స్‌లో రూపేష్, యశ్వంత్ విజేతలుగా నిలిచారు.

వీరిని ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అభినందించి జ్ఞాపికలను అందజేశారు. వీరు వివిధ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. అసోసియేషన్ కోశాధికారి ఇమ్మిడిశెట్టి శ్రీకాంత్, సభ్యులు మద్దిపాటి ప్రసాద్‌రావు, తాళ్లపాక వరప్రసాద్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్, విజయ్ కుమార్, కోచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణాలకు గ్రహణం

- మందగించిన ఆధునికీకరణ పనులు
- గత ప్రభుత్వంలో నిధుల మంజూరు



నిర్మాణ దశలో ఆగిపోయిన నావూరు రోడ్డు

**పొదలకూరు :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన పలు రోడ్డు నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. ఆయా పనులకు నిధులు మంజూరైనా ప్రస్తుత ప్రభుత్వంలో పురోగతి లేకుండా ఉంది. మండలంలోని నావూరు రోడ్డు పనులు కొంతకాలంగా మందగించింది. ఈ రోడ్డు పనులు పూర్తయితే ఏడు గ్రామాల ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణం ఏర్పడుతుంది. అయితే వేగంగా జరగాల్సిన పనుల్లో జాప్యం నెలకొంది. సర్వత్రిక ఎన్నికల కోడ్‌కు ముందు రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి గత ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఈ నావూరు రోడ్డు వయా ప్రభగిరిపట్నం మీదుగా చేజర్ల మండలం కొండలరాయుడు కండ్రిక వరకు రూ.10.83 కోట్లు, మధ్యలో నావూరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.3.62 కోట్లు మొత్తం రూ.14.45 కోట్లు మంజూరు చేసి అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పనులను ప్రారంభించారు. కాంట్రాక్టర్లు పనులను అప్పట్లో శరవేగంగా నిర్వహించారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో పనులు మందకొడిగా జరుగుతున్నాయి. నావూరు వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను ఇప్పటి వరకు ప్రారంభించనే లేదు. రోడ్డు పనులను మాత్రం మందకొడిగా చేపడుతున్నారు. ఈ పాటికే బీటీ రోడ్డు పనులు పూర్తయి వాహనాలు తిరగాల్సి ఉండగా జాప్యం నెలకొంది. ప్రభుత్వం మారడంతో నిధుల విడుదల తదితర సాంకేతిక సమస్యలతో పనులు మందగించినట్టుగా అధికారులు వెల్లడిస్తున్నారు. బ్రిడ్జి పనులను ప్రారంభిస్తారా? లేక నిలిపివేస్తారా? అనే సందేహాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. గ్రామాలకు ఎంతో ఉపయోగకరమైన రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాల్సిందిగా ఆయా గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో వాగు పొంగి నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం తదితర గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతుంటాయి. దీనివల్ల బ్రిడ్జి నిర్మాణ పనులను కూడా పూర్తి చేయాల్సిందిగా కోరుతున్నారు.

## భూ కబ్జాలపై చర్యలకు డిమాండ్



ఆందోళన చేస్తున్న కొమ్మలపూడి రైతులు

**మనుబోలు :** తమ గ్రామంలో ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కొమ్మలపూడి రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేశారు. అనంతరం గ్రీవెన్స్‌డేలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొమ్మలపూడి గ్రామంలో చెందులూరు శ్రీనివాసులు, గుర్రం ప్రభాకర్, ప్రసాద్ అనే వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. సర్వే నంబర్ 23/2లో చెందులూరు శ్రీనివాసులు కుటుంబ సభ్యులు ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని తెలిపారు. రీసర్వేలో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయన్నారు. రెవెన్యూ రికార్డుల్లో వారి పేర్లు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. కొమ్మలపూడిలో 48 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, దానిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

## పాఠశాలకు కుర్చీల వితరణ



కుర్చీలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

**ముత్తుకూరు :** మండలంలోని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్‌లో 2005–06లో చదివిన పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకొంటూ పాఠశాలకు 40 కుర్చీలను వితరణ చేశారు. టి.కిశోర్, శివయ్య, టి.సుబ్రహ్మణ్యం, శ్రీలత, చరిత తదితరులు తాము చదివిన తరగతి గదులను సందర్శించి, నాటి ఉపాధ్యాయుల విద్యా బోధనను గుర్తు చేసుకున్నారు. హెచ్‌ఎం తాన్య నాటి విశేషాలను చర్చించుకున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం కుర్చీలను బహూకరించినట్లు వారు తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైల్వే యార్డులో సమస్యలను పరిష్కరించాలి



పడుగుపాడు రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

**కోవూరు :** పడుగుపాడు రైల్వే యార్డులో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ది రైల్వే వ్యాగన్ లోడింగ్ అండ్ అన్‌లోడింగ్ వర్కర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పడుగుపాడు రైల్వేస్టేషన్ వద్ద సోమవారం ధర్నా చేశారు. అనంతరం ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పడుగుపాడు రైల్వే యార్డులో లోడింగ్ అండ్ అన్ లోడింగ్ వర్కర్స్‌గా 150 మంది పని చేస్తున్నారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. యార్డులో పడమర వైపు రోడ్డు గుంతలమయంగా ఉందని, దీనివల్ల వేసవిలో దుమ్ము ధూళి, వర్షాకాలం బురదమయంగా ఉందని తెలిపారు. ఈ రోడ్డును మరమ్మతులు చేయాలని, రైల్వే బోగీలను స్తంభాలకు అడ్డం లేకుండా నిలపాలని, కార్మికులు విశ్రాంతి తీసుకునేందుకు గదిని ఏర్పాటు చేయాలని, యార్డులో తాగునీటి సౌకర్యం కల్పించాలని, స్కూటర్లకు పార్కింగ్ ప్లేస్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మూలం ప్రసాద్, వేణు, వెంకటేశ్వర్లు, రత్నం, రైల్వే లోడింగ్ అండ్ అన్ లోడింగ్ వర్కర్లు పాల్గొన్నారు.

## రొయ్యల సాగు పద్ధతులు భేష్



క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న బృంద సభ్యులు

**ఇందుకూరుపేట :** భారతదేశంలో రొయ్యల సాగు పద్ధతులు బాగుందని రొయ్యల అభివృద్ధి వ్యవస్థ(యూఎస్‌ఏ) డైరెక్టర్ డాక్టర్ హారీస్ రైట్ అన్నారు. మండలంలోని మైపాడు, గంగపట్నం గ్రామంలో ఆ బృంద సభ్యులు సోమవారం పర్యటించారు. తొలుత గంగపట్నం గ్రామంలో రొయ్యల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మైపాడులో వీనస్ హేచరీ యాజమాని ప్రతాపనేని గోపీ ఆధ్వర్యంలో గ్లోబల్ టెక్నికల్ హెడ్(సింగపూర్) నానాంగ్ హిందార్‌తో కలిసి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వెనామీ హార్డీలెన్ ప్లస్ రొయ్యల సీడ్ గురించి రైతులకు వివరించారు. ష్రింప్ ఇంప్రూవ్‌మెంట్ సిస్టమ్‌లో భాగంగా పలు దేశాలకు తల్లి రొయ్యలను పంపుతున్నట్లు తెలిపారు. ఇక్కడి రైతుల సాగు తీరు మిన్నగా ఉందన్నారు. కార్యక్రమంలో ష్రింప్ ఇంప్రూవ్‌మెంట్ సిస్టమ్ టెక్నికల్ మేనేజర్ డాక్టర్ రుషి, మేనేజర్ శివ పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొన్న మోటార్‌బైక్

- వ్యక్తి దుర్మరణం



మహేష్ మృతదేహం

**మనుబోలు:** మోటార్‌బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని 16వ జాతీయ రహదారిపై గురివిందపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు అయ్యప్పగుడి సెంటర్ డ్రైవర్స్ కాలనీకి చెందిన ఏసూరు మహేష్ (42)కు భార్య ఉమామహేశ్వరి, ఇద్దరు పిల్లలున్నారు. అతను ప్రస్తుతం తన అత్త ఊరైన మనుబోలు మండలంలోని జట్ల కొండూరు గ్రామంలో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి బైక్‌పై నెల్లూరుకు వెళ్తూ గురివిందపూడి సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. స్థానికులు తీవ్రంగా గాయపడిన మహేష్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న మనుబోలు ఎస్సై అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### కామాక్షితాయి సేవలో..



అమ్మవారిని దర్శించుకున్న తీర రక్షక దళ అధికారులు

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్ :** జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని విశాఖపట్నం తీర రక్షక దళం కమాండర్ రాజేష్ మిట్టల్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అజిత్‌కుమార్ సోమవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ శ్రీనివాసులురెడ్డి, ఆలయ సిబ్బంది అతిథులను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

**వెంకటాచలం :** మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో సోమవారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన రమేష్‌బాబు పనినిమిత్తం బైక్‌పై ముత్తుకూరు మండలం పంటపాళెం వెళ్లాడు. తిరిగి గూడూరుకు వెళ్తుండగా, సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో రమేష్‌బాబుకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

### వినతుల స్వీకరణ

**పొదలకూరు :** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తహసీల్దార్ శివకృష్ణ సోమవారం నిర్వహించారు. గ్రామాల నుంచి వచ్చిన రైతులు వివిధ సమస్యలను తహసీల్దార్‌కు విన్నవించారు. పొదలకూరు పంచాయతీ పరిధిలోని చిట్టేపల్లికి చెందిన రైతు పట్టాదారు పాసు పుస్తకం కోసం రాతపూర్వకంగా వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు డిప్యూటీ తహసీల్దార్ సాయిగణేష్ పాల్గొన్నారు.

## లెప్రసీపై అవగాహన అవసరం



గురుకులంలోని సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి

**కొడవలూరు :** పాఠశాల దశలోనే విద్యార్థులకు లెప్రసీపై అవగాహన అవసరమని అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి అన్నారు. మండలంలోని చంద్రశేఖరపురం గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ రూమ్‌లోని సరుకుల నాణ్యత, వంట గదుల్లో పరిశుభ్రతను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజన సదుపాయంతో పాటు పరిసరాల పరిశుభ్రత అవశ్యమని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. అనంతరం లెప్రసీ, టీబీ వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాటి లక్షణాలు ఎలా ఉంటాయి, ప్రాథమిక దశలో గుర్తించడం వల్ల ప్రయోజనం తదితర విషయాలను వివరించారు. చివరిగా రేగడిచెలిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించి లెప్రసీ సర్వే సమగ్రంగా పూర్తి చేయడంతో పాటు గురుకులంలో తరచూ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ, టీబీ నియంత్రణాధికారులు విజయ్, సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు పద్మజ, టి.రాధమ్మ, ఆశా కార్యకర్త శీనమ్మ ఉన్నారు.

## 'వెంకటేశ్వర' ప్రొఫెసర్‌కు డాక్టరేట్



ప్రొఫెసర్ సురేష్‌ను సన్మానిస్తున్న చైర్మన్, ప్రిన్సిపల్

**కొడవలూరు :** మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ తోడేటి సురేష్ అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(జేఎన్‌టీయూ) నుంచి డాక్టరేట్ పొందారు. జేఎన్‌టీయూ గణిత విభాగపు ప్రొఫెసర్ ఇ.కేశవరెడ్డి పర్యవేక్షణలో ఆయన వ్యాసాన్ని సమర్పించి డాక్టరేట్ అందుకున్నారు. ఈ క్రమంలో ప్రొఫెసర్ సురేష్‌ను కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, ప్రిన్సిపల్ ప్రకాశ్‌రావు సోమవారం శాలువా, జ్ఞాపికలతో ప్రత్యేకంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

## కాలువల్లో పూడిక తీయించండి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్ :** నగర పంచాయతీ పరిధిలోని పాత, కొత్త గుడిపల్లి కాలువలతో పాటు రేబాల కాలువలో పూడిక తీయించాలని సీపీఎం నాయకులు సోమవారం నగర పంచాయతీ అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడిపల్లి కాలువలో పూడిక తీయకపోవడంతో చిన్న వర్షానికే కాలువ పొంగి నీరు రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. దీనివల్ల దోమలు వ్యాప్తిచెంది డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి పూడిక తీసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.శ్రీనివాసులు, మునీర్, జానీబాషా, ఎం.శ్రీనివాసులు, ఖాదర్‌బాషా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైస్‌మిల్లు యజమాని మోసగించారు



మాట్లాడుతున్న రైతులు

**నెల్లూరు(క్రైమ్):** తమ వద్ద రూ.కోట్ల విలువజేసే ధాన్యాన్ని తీసుకొని నగదును ఇవ్వకుండా మిల్లర్ మోసగించారని, విచారణ జరిపి న్యాయం చేయాలని రైతులు, దళారులు కోరారు. రైస్‌మిల్లు యజమాని శేఖర్‌బాబుపై రైతులు, దళారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ కృష్ణకాంత్‌కు వినతిపత్రాన్ని సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 434 మంది రైతులు పండించిన రూ.4.66 కోట్ల విలువజేసే ధాన్యాన్ని కొత్తకాలువకు చెందిన రైస్‌మిల్లు యజమాని శేఖర్‌బాబు అప్పు ప్రాతిపదికన కొనుగోలు చేశారని చెప్పారు. రోజులు గడుస్తున్నా ధాన్యం తాలూకు నగదును ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. దీంతో తమ కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్‌మిల్లు యజమానిపై నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారని చెప్పారు. ముత్తుకూరు రోడ్డు, నారాయణరెడ్డిపేటలోని పలువురు రైస్‌మిల్లర్లు, కావలిలోని డీలర్‌కు బకాయి ఉండటంతో రైతుల ధాన్యాన్ని వారు తీసుకెళ్లారనే విషయం విచారణలో వెల్లడైందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని చెప్పారు. కాగా సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని ఎస్పీ ఆదేశించారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



వెంకటాచలం : మాట్లాడుతున్న జిల్లా మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు



ఇందుకూరుపేట : సహపంక్తి భోజనం చేస్తున్న ఛాత్రోపాధ్యాయులు

**వెంకటాచలం :** విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజున శుభ్ దిన్ భోజన్ కార్యక్రమాన్ని మండలంలోని ఇస్కపాళెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులతో ఉపాధ్యాయులు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు పాఠశాల విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని, తద్వారా మంచి ఫలితాలు సాధిస్తారని తెలియజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిడిగుంటపాళెం, ఇస్కపాళెం పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చలపతి, పార్వతీశం, ఉపాధ్యాయులు మాధవ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

**పీవీకండ్రిగలో శుభ్ దిన్ భోజన్**

**ముత్తుకూరు :** మండలంలోని పాటూరువారికండ్రిగ ప్రభుత్వ పాఠశాలలో శుభ్ దిన్ భోజన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత హెచ్‌ఎం డాక్టర్ జీవీబీ మురళీకృష్ణ 150 మంది విద్యార్థులకు స్వీట్లు, కారపూసతో కూడిన విందు భోజనం సమకూర్చారు. ఎంఈఓ మధుసూదన ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులకు వీటిని అందజేశారు. హెచ్‌ఎం పేర్నేటి లక్ష్మీశ్వరి, ఏపీటీఎఫ్ నాయకులు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**డైట్ కళాశాలలో..**

**ఇందుకూరుపేట :** మండలంలోని పల్లిపాడులో ఉన్న డైట్ కళాశాలలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా సామూహిక శుభ్ దిన్ భోజన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ 'జాతీయ విద్యా విధానం 2020'ను ప్రవేశపెట్టి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు శిక్షా సప్తాహ్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా చివరి రోజు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమ సౌజన్యంతో సహపంక్తి భోజన కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, ఛాత్రోపధ్యాయులు పాల్గొన్నారు.



ముత్తుకూరు : విద్యార్థులకు విందు భోజనం అందజేత

**పలు పాఠశాలల్లో**

**కొడవలూరు :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 'శుభ్ దిన్ భోజన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో ఏడో రోజు దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన మెనూతో పాటు రుచికర వంటకాలతో భోజనం పెట్టాలని విద్యాశాఖ ఆదేశించడం తెల్సిందే. ఈ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులే దాతలుగా మారి విద్యార్థులకు సోమవారం రుచికర వంటకాలతో భోజనం వడ్డించారు. కొడవలూరు హైస్కూల్‌లో నిర్వహించిన శుభ్ దిన్ భోజన్ కార్యక్రమాన్ని ఎంఈఓ ఎస్.అంకయ్య, కొడవలూరు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ జి.వసంతకుమారి పరిశీలించారు.



కొడవలూరు ఎస్సీ కాలనీ పాఠశాలలో శుభ్ దిన్ భోజన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ